క్లుప్తంగా

సంతకాలకే పరిమితమైన సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి

సీతానగరం: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక పరమైన సమస్యలు పరిష్కరించాలని మండల అధికారులను ఎంపీడీఓ బి కృష్ణమహేష్‌రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సభ్యులతో గురువారం మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీపీ బి.రమణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా సభ్యులు, అధికారులు, సర్పంచ్‌లు సమావేశ మందిరంలోకి రాగానే ఎన్నికల కోడ్ నింబధనల ప్రకారం మండల సమావేశం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం బాబ్జీ, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, మండల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీ నృసింహ స్వామికి విశేష పూజలు



భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గురువారం స్వామిని చామంతి పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాసా చార్యులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి గురువారం వేకువ జాము నుంచే నిర్వహించే పూజా కార్యక్రమానికి మండలంలోని పలుగ్రామాల నుంచి, సాలూరు, మక్కువ, బొబ్బిలి, పార్వతీపురం ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయానికి అతి చేరువలో ఉన్న సువర్ణముఖినదిలో భక్తులు స్నానాలు చేసి పూజాసామగ్రితో వచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లిస్తారని తెలియజేశారు.

జగనన్న లే అవుట్‌ను పరిశీలించిన ఈఈ



లే అవుట్ వద్ద పనులను పరిశీలిస్తున్న పబ్లిక్‌హెల్త్ ఈఈ దక్షిణామూర్తి

సాలూరు: పట్టణంలోని గుమడాం వద్ద గల జగనన్న లే అవుట్‌ను పబ్లిక్ హెల్త్ ఈఈ దక్షిణామూర్తి గురువారం పరిశీలించారు.గుమడాం లే అవుట్-5లో సుమారు రూ.కోటి 30 లక్షలతో, లే అవుట్ -4లో సుమారు రూ.30 లక్షలతో జరుగుతున్న అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సౌకర్యం, తదితర వసతుల నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. మార్చినాటికి ఈ పనులు పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.ఆయన వెంట మున్సిపల్ డీఈ ఎల్.సూరినాయుడు ఉన్నారు.


ట్యాక్సులు విధిగా చెల్లించాలి



పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న అధికారులు

సాలూరు: నిబంధనల మేరకు వాహనదారులు విధిగా ట్యాక్స్ సొమ్ము చెల్లించాలని ఆర్‌టీఓ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం సాలూరులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్యాక్సులు కట్టని వాహనదారులను గుర్తించి వారికి జరిమానాలు విధించారు. ట్యాక్సులు కట్టని వారు తక్షణమే కట్టాలని సూచించారు. వాహనపత్రాలను విధిగా నిబంధనల మేరకు రెన్యువల్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. సాలూరుతోపాటు పాచిపెంట, మక్కువలలో ఈ డ్రైవ్ నిర్వహించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐలు ప్రసాద్, శశికుమార్, రమేష్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ



స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని మాన్యశ్రీ, గంగా ఆస్పత్రుల్లోని స్కానింగ్ కేంద్రాలను డీటీసీఓ డాక్టర్ శ్యామ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అవి చేయకూడదని, ఆడా, మగా అని ముందుగా అడగడం, చెప్పడం నేరమని, విధిగా వాల్‌పోస్టర్ అంటించాలని పేర్కొన్నారు. స్కానింగ్ రికార్డ్స్, రిపోర్ట్స్ పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ కావాలి

- అదే గృహ సారథుల లక్ష్యం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ పాలన మరింతగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా గృహ సారథులు పనిచేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలోని 1,15 సచివాలయాల గృహ సారథులతో సమీక్షా సమావేశం నిర్వహించి విధివిధానాలను దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పరిధిలోని గృహ సారథులు వారికి కేటాయించిన 50కుటుంబాలకు సంబంధించి అర్హులకు సంక్షేమ పథకాలు అందించి సేవ చేసే విధంగా పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చేలా కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందే విధంగా గృహ సారథులు, కన్వీనర్లు కీలకంగా పని చేయాలని సూచించారు.ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా గృహ సారథులు,కన్వీనర్లు పని చేయాలని చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు రణభేరి చిన్నంనాయుడు, యడ్ల త్రినాథ్, సువ్వాడ లావణ్య, తాడ్డి శంకరావు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ గొర్లి మాధవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోండి



అజ్జాడలో యువకులతో మాట్లాడుతున్న జమ్మాన ప్రసన్నకుమార్

బలిజిపేట: యువకులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సూచించారు. మండలంలోని అజ్జాడ, మురగడాం, పెద్దింపేట గ్రామాలలో గురువారం ఆయన పర్యటించి యువకులకు చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని ఈ విధంగా మరే ఇతర రాష్ట్రాలలో లేదని తెలిపారు. చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలు స్థాపించుకునేందుకు యువతకు ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఉపాధి కల్పనలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వాటిని యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెద్దింపేట ఎంపీటీసీ సాంబమూర్తి, అజ్జాడ ఎంపీటీసీ గణేష్, అజ్జాడ ఉప సర్పంచ్ లక్ష్మణరావు, యువకులు పాల్గొన్నారు.

పూర్తి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు



సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శ్రావణ్

బలిజిపేట: మండలంలో పండిన ఖరీఫ్ వరి పంట పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ఆర్బీకేల ద్వారా మిగులు ధాన్యాలకు సంబంధించి యాప్‌లలో అప్‌లోడ్ చేసినట్లు ఏఓ శ్రావణ్ తెలిపారు. మండలంలో 40,390మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసి 35,980మెట్రిక్ టన్నులు కొనుగోలు నిర్వహించేందుకు నిర్ధారించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ మేరకు 27,019మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని, మిగిలిన 6,894మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఆర్బీకేల ద్వారా రైతుల ధాన్యాలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధన ఉన్నందున పనులపై చర్చ, ఆమోదానికి అవకాశం లేకుండా సమావేశం నిర్వహించి ముగించారు. వేసవి రానున్న దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా త్వరగా అందించాలని సభ్యులు కోరారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడుతూ 34లే అవుట్స్‌కు 21లే అవుట్స్‌లో బోర్లు ఏర్పాటు చేశామన్నారు. 15చోట్ల ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటుచేస్తామని మిగిలినవి త్వరలో పూర్తవుతాయని తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి గ్రామాలలో క్రాష్ ప్రోగ్రాం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్యసమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ బద్నాన ప్రమీల

పాచిపెంట: ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మండల సర్వసభ్య సమావేశం ఎటువంటిచర్చలు,తీర్మానాలు లేకుండా సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ బద్నాన ప్రమీల అధ్యక్షతన ఎంపీడీఓ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి పనుల గుర్తింపు ,సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చలు, తీర్మానాలు చేయలేదు. ఏమైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలిపితే ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పరిశీలిస్తామని ఎంపీపీ తెలిపారు. సమావేశంలో జెడ్పి వైస్‌చైర్మన్ కొ(ర)జన్ని సింహాచలం, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర 'భూ' సర్వే వేగవంతం చేయాలి

- ఆర్డీఓ హేమలత

సీతానగరం: జగనన్న 'భూరక్ష' భూ హక్కు పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన సమగ్ర భూసర్వే పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ కె.హేమలత ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆమె మండలంలోని జోగింపేట రెవెన్యూ గ్రామాల్లో సర్వే సిబ్బంది భౌతికంగా నిర్వహిస్తున్న భూ సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శతాబ్దకాలం క్రితం భూముల సర్వే జరిగిందన్నారు. తాజాగా సమగ్ర రీ సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సీతానగరం మండలంలో సర్వే జరుగుతోందని చెప్పారు. ఇప్పటికే 6 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తికావడంతో హక్కుపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మొదటి విడత రీ సర్వే చేసే సమయంలో జారీ చేసిన హక్కుపత్రాల వివరాలను తహసీల్దార్ ఎన్వీరమణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండలసర్వేయరు, ఆర్‌ఐ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏప్రిల్ 9వ తేదీన జరగనున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో మిస్టర్ ఆంధ్ర 2023 బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. బాడీ బిల్డింగ్ పోటీల నిర్వహణకు ప్రభుత్వం తరపున, తన తరపున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి తొమ్మిది కేటగిరీల్లో 200 మంది వరకు క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని మారుతి జిమ్ నిర్వాహకుడు ఎల్.మోహన్ తెలియజేశారు.

96వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న వెంకటరమణ

పార్వతీపురంటౌన్: కురుపాం మండల కేద్రానికి చెందిన నడికట్ల రమణమ్మకు సర్జరీ నిమిత్తం పార్వతీపురం పట్టణానికి చెందిన వారణాసి వెంకటరమణ 96 వ సారి రక్తదానం చేశాడు. రమణమ్మను జిల్లా ఆస్పత్రిలో గురువారం చేర్చగా 2 యూనిట్ల రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని రోగి బంధువుల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులకు తెలియజేసారు. వారు వెంటనే పట్టణ వాసి అయిన వారణాసి వెంకటరమణను సంప్రదించగా తక్షణమే ఆయన స్పందించి ఒ పాజిటివ్ రక్తం దానం చేసి రోగి రమణమ్మను ఆదుకున్నారు. ఈ సందర్భంగా రక్తదాత మాట్లాడుతూ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో తాను స్వచ్ఛంద సేవా కార్యకర్తగా ఉంటానని తెలియజేశారు. పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, కమిటీ సభ్యులు, పేషెంట్ కుటుంబసభ్యులు రక్తదాత వారణాసి వెంకటరమణను అభినందించారు.

పరీక్షల భయం విడనాడాలి



మాట్లాడుతున్న లెక్చరర్ ఈశ్వరరావు

సాలూరు: పరీక్షలంటే భయాన్ని విద్యార్థులు విడనాడాలని సీనియర్ డైట్ లెక్చరర్ ఈశ్వరరావు సూచించారు. పరీక్షాపర్వ్ 4.0. కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ రాజకుమార్ అధ్యక్షతన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పదవతరగతి విద్యార్థులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, పబ్లిక్ పరీక్షలకు ఇంకా తక్కువే సమయం ఉందని, ప్రణాళికా బద్ధంగా చదవడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు పలు మెలకువలను ఈ సందర్భంగా తెలిపారు. శతశాతం ఉత్తీర్ణత, ఉత్తమ ఫలితాల సాధన దిశగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

రహదారి భద్రత నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై పాపారావు

పార్వతీపురంటౌన్: రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని వెంకంపేట ఫ్లోరీలు, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, కొత్తవలస జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటించని వారిపై 15కేసులు, ఓవర్‌లోడ్‌తో వస్తున్న ఆటోలపై 8 కేసులు నమోదు చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలని, వాహన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని హితవు పలికారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న చలానాలను తక్షణమే చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కిశోర్, శేఖర్ పాల్గొన్నారు.

డీఈసీ మాత్రల పంపిణీ పరిశీలన



పిల్లలకు డీఈసీ మాత్రలు వేస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: డీఈసీ, ఆలెండజోల్ మాత్రలను పట్టణంలోని 28 వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు వేస్తుండగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన స్వయంగా పిల్లలకు ఫైలేరియా నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఫైలేరియా, నులి పురుగుల నివారణకు ఒక డీఈసీ మాత్ర, ఒక ఆల్బెండజోల్ మాత్ర వేశామని, ముందుగా సూచించిన జాగ్రత్తలు సిబ్బంది పాటిస్తున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు చేతులు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని అంగన్వాడీ సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. ఇంకా ఎవరైనా పిల్లలు మాత్రలు వేసుకోని ఎడల గృహ సందర్శన ద్వారా గుర్తించి మాత్రలు వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్ప, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి కృష్ణంరాజు

పార్వతీపురం టౌన్: అంగన్వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో అంగన్వాడీ కేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి కృష్ణంరాజు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని పెద్దబొండపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 15రోజులకొకసారి గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో 14రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. 62రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల ఇళ్లవద్దకే వెళ్లి వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పునశ్చరణ తరగతులు

- జిల్లా విద్యాశాఖాధికారి ఎస్డీవీ రమణ



పునఃశ్చరణ తరగతులు ప్రారంభిస్తున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురంటౌన్: విద్యార్థులకు ప్రేరణ, పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రమణ తెలిపారు. పునఃశ్చరణ తరగతులను స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు శిక్షణ అందజేస్తున్నామన్నారు. వివిధ మాధ్యమాలకు సంబంధించిన ఉపాధ్యాయులు సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యార్థులకు పలు సూచనలు గణిత శాస్త్రంలో మెలకువలు సంబంధించిన శిక్షణ తరగతులు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యార్థులతో బీసీ వెల్ఫేర్ అధికారులు మాట్లాడుతూ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని, జిల్లాకు, తల్లిదండ్రులకు విద్యార్థులు మంచి పేరు తేవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీడబ్ల్యూఓ ఎస్. సాంబమూర్తి, డీబీసీడబ్ల్యూఓ ఎస్.కృష్ణ, జిల్లా పరిధిలో ఉన్న వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపుంటౌన్: హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు ఆదేశించారు. మాతృ మరణాలపై ఉపసంఘం సమీక్షా సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 2022 నవంబరు నుంచి 2023 జనవరి వరకు జరిగిన మూడు మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. తాడికొండ పీహెచ్‌సీ పరిధి పెదఖర్జ, జియ్యమ్మవలస పీహెచ్‌సీ పరిధి బాసంగి, సీతంపేట మండలం మర్రిపాడు పీహెచ్‌సీ పరిధి రేగుల గూడలో మాతృ మరణాలు జరిగాయన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి, చక్కని ప్రణాళికలతో ప్రసవానికి ముందుగానే ఆస్పత్రిలో చేర్చి స్త్రీ వైద్య నిపుణులతో పరీక్షలు విధిగా నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షించాలని ఆశ, ఏఎన్‌ఎంలను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.కె.విజయ పార్వతి, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.వెంకటరమణ, గైనకాలజిస్ట్ డాక్టర్ బి.కమలకుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జగన్‌మోహన్ రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, వైద్యాధికారులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక కల్యాణోత్సవం

బలిజిపేట: మండలంలోని గలావల్లి గ్రామంలో గల శ్రీ ఉమాసహిత కామలింగేశ్వర దేవాలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ధర్మకర్తలు, గ్రామ పెద్దల సమక్షంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మాఘమాసం బహుళ ఏకాదశినాడు ఆలయ వార్షికోత్సవ కల్యాణాన్ని గత 10సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నట్టు అర్చకులు ఈ సందర్భంగా తెలిపారు. భక్తులు, ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కావాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి

సాలూరు: మున్సిపాలిటీలో గ్రంథాలయ భవనం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ మెంబర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి కోరారు. ఈ మేరకు గురువారం ఆమె మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడారు. గ్రంథాలయాల నిర్మాణానికి స్థలం కేటాయింపుతో పాటు, గ్రంథాలయాల సెస్ బకాయిలు చెల్లించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. స్థలం కేటాయిస్తే భవన నిర్మాణం మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. విజయనగరం జిల్లాలో దత్తిరాజేరు, డెంకాడ, మొరకముడిదాంలకు ఇటీవల నూతన గ్రంథాలయాలకు భవనాలు మంజూరయ్యాయని వివరించారు.

ముస్తాబవుతున్న శివాలయాలు



ముస్తాబైన పెదబొండపల్లిలోని శివాలయం

పార్వతీపురం: మండలంలోని పలు శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబవుతున్నాయి. పెదబొండపల్లిలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శివరాత్రి సందర్భంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకాలతో పాటు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్థానిక ఎంపీటీసీ మండల పకీరునాయుడు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకుడు లక్ష్మణ్‌బాబు

సీతానగరం: రబీసీజన్‌లో రైతులు పండించిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు లక్ష్మణ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ పంట నమోదుపై గురువారం సీతానగరం మండలంలోని దయానిధిపురం గ్రామంలో పరిశీలించారు. గ్రామంలో వేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు రైతులు ఎంత విస్తీర్ణంలో వేశారు. ఏపీ రైతులు వేశారో తెలుసుకునేందుకు ప్రతి సర్వే నంబర్‌కు వెళ్లి చూశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవినాష్, వీఆర్‌ఓ శ్రీనివాస్, వీఏఏ శంకర్, రైతులు పాల్గొన్నారు.

మక్కువలో..

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామంలో రైతులకు చెందిన పంటనమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం సహాయ వ్యవసాయ సంచాలకుడు కె.లక్ష్మణ్‌బాబు గురువారం పరిశీలించారు. గ్రామానికి చెందిన 34మంది రైతుల పంట పొలాల్లో పర్యటించి, రబీపంటనమోదును, మొక్కజొన్న, పెసర పంటలను పరిశీలించారు. పంటపొలాల సర్వేనంబర్లు, పంట విస్తీర్ణం, నీటి ఆధారం తదితర వివరాలను వ్యవసాయశాఖ సిబ్బంది సక్రమంగా నమోదుచేశారా? లేదా అన్న విషయాలను రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో బి.శ్రీనివాసరావు, గ్రామవ్యవసాయ సహాయకురాలు ఎస్.దివ్య, గ్రామరెవెన్యూ అధికారి రూప పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనకు ఉపాధ్యాయుల కృషి



మాట్లాడుతున్న ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలన సభ్యులు

సీతానగరం: ఉపాధ్యాయుల బోధనా తీరులో మార్పు నాణ్యమైన విద్యను అందించడానికి దోహదపడుతుందని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలన సభ్యులు ఎల్. రామకృష్ణ, ఎం.రామకృష్ణలు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ , ఉపాధ్యాయుల బోధన తీరు, రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మారుతున్న విద్యాబోధనకు అనుగుణంగా ఉపాధ్యాయులు తర్ఫీదు పొంది విద్యార్థులకు బోధించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రతినిధి రామకృష్ణ, ఎస్.రామకృష్ణ, ఎంఈఓ జి.సూరిదేముడు పాల్గొన్నారు.